
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

నాగర్‌కర్నూల్
జిల్లా వార్తలు
రంజాన్ వేళలు మంగళవారం(ఇఫ్తార్-6:38), బుధవారం(సహెర్-4:42)
మంగళవారం 9 ఏప్రిల్ 2024


మహబూబ్‌నగర్ మార్కెట్‌లో మామిడాకులు, మామిడి కాయలు కొంటున్న ప్రజలు


మామిడి పచ్చడి కోసం కుండలు కొంటున్న మహిళలు

నేడు ఉగాది

- పచ్చడి తయారీ కోసం కొత్త కుండల కొనుగోలు
- పంచాంగ శ్రవణాలకు ప్రత్యేక ఏర్పాట్లు
- ఎన్నికల సీజన్ కావడంతో రాజకీయ నాయకుల బలాబలాలపై సర్వత్రా ఆసక్తి

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 8: ఉగాది అనగానే షడ్రుచులతో చేసే పచ్చడి, పంచాంగ శ్రవణాలు గుర్తొస్తాయి. మంగళవారం ఉమ్మడి జిల్లా ప్రజలంతా క్రోధినామ ఉగాది సంవత్సరాన్ని ఘనంగా జరుపుకునేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. సోమవారం అమావాస్య కావడంతో ఆలయాలను శుద్ధి చేశారు. ఈ పండగను ప్రజలు ప్రత్యేకంగా జరుపుకుంటారు. ఇళ్లను శుద్ధి చేసి మామిడి తోరణాలు కడతారు. కొత్తకుండలో షడ్రుచులతో పచ్చడి చేస్తారు. పులుపు, వగరు, తీపి, కారం, చేదు, ఉప్పు రుచులతో ఉగాది పచ్చడి చేస్తారు. పచ్చడి తయారీకి కావలసిన ఐటమ్స్ అన్నీ ఒకే దగ్గర ప్యాక్ చేసి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. పచ్చడి తయారీ కోసం కుండలను కూడా అమ్ముతున్నారు. పాలమూరు పట్టణంలోని ప్రధాన రహదారుల అంచున కుంటలు, మార్కెట్‌లో మామిడి ఆకులు, వేప పూత విక్రయిస్తున్నారు. ఉగాది స్పెషల్ అయిన భక్షాలను కొందరు ఇళ్లలో చేసుకుంటుండగా.. మరి కొందరు మార్కెట్‌లోనే కొనుగోలు చేస్తుంటారు. భక్షాల తయారీ కోసం ముందుగా ఆర్డర్‌లు ఇస్తున్నారు.

రాజకీయ సందడి

ఎన్నికల సీజన్ కావడంతో పంచాంగ శ్రవణాలు.. ముఖ్యంగా తమ పేరు బలాలను తెలుసుకునేందుకు బరిలో ఉన్న నాయకులు ఉత్సాహం చూపుతుంటారు. తమ పేరిట ఉన్న బలాన్ని బట్టి విజయావకాశాలను అంచనా వేసుకుంటారు. ఆదాయం, ఖర్చు, అవమానం, రాజయోగం వంటి విషయాలు పరిశీలిస్తారు. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బరిలో ఉన్న అభ్యర్థులతో పాటు, వారి పేరు బలాలు ఎలా ఉన్నాయో తెలుసుకునేందుకు ప్రజలు, కార్యకర్తలకు ఆసక్తి ఉంటుంది. తమ భవిష్యత్తును నిర్ణయించే ఉగాది పంచాంగ శ్రవణం పేరు బలాలను తెలుసుకునేందుకు నాయకులు ఒకరిద్దరు పండితులతో సమాచారం తెప్పించుకోనున్నారని సమాచారం. పార్లమెంట్ ఎన్నికలతో పాటు రానున్న సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్న నాయకులు కూడా ఉగాది పంచాంగం పేరుబలాలతో ముందుకు సాగనున్నారు. కొందరికి పేరుబలాలు ఆరు నెలలు బాగుంటే.. ఆ తరువాత బలహీనంగా ఉండొచ్చు. ఇంకొందరికి మొదటి ఆరు నెలలు బలాలు అనుకూలించకపోగా, చివరి ఆరు నెలలు గ్రహాలు అనుకూలించే అవకాశం ఉంటుంది. అలాంటి వారంతా పోటీ చేసేందుకు ఎన్నికల సమయాన్ని చూసుకుని లెక్కలు వేసుకోనున్నారు.

పంచాంగ శ్రవణం

పండుగ సందర్భంగా సాయంత్రం జిల్లాలోని ప్రముఖ ఆలయాల్లో పంచాంగ శ్రవణాలు వినిపించనున్నారు. ఇందుకోసం పండితులు, సిద్ధాంతులు పంచాంగాలతో రెడీ అవుతున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సముదాయంలోనూ పంచాంగ శ్రవణం చేయనున్నారు. అధికారులంతా అక్కడే తమ పేరు బలాలు చూసుకోనున్నారు. అదే విధంగా పట్టణంలోని టీచర్స్ కాలనీ రామాలయం, శ్రీనివాస కాలనీలోని పంచముఖి ఆంజనేయస్వామి దేవాలయం, వీరన్నపేట శివాలయం, భగీరథ కాలనీ రామాలయం, పద్మావతి కాలనీ కాళికాదేవి ఆలయంతో పాటు మన్యంకొండ, కందూరు, కురుమూర్తి ఆలయాల్లో కూడా పంచాంగశ్రవణాలు చేయనున్నారు.


నారాయణపేటలో విక్రయిస్తున్న మామిడి కాయలు

50 వేల మెజారిటీ ఇవ్వాలి

- పార్టీ శ్రేణులకు సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు


కొడంగల్‌లో నాయకులతో సమీక్ష నిర్వహిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

వికారాబాద్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోకి వచ్చే కొడంగల్ నుంచి లోక్‌సభ ఎన్నికల్లో 50 వేల మెజార్టీ తగ్గకుండా ఆధిక్యత ఇవ్వాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని కొడంగల్‌లోని తన నివాసంలో పార్టీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి, పార్టీ పరిశీలకుడు సంపత్‌కుమార్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి తిరుపతిరెడ్డితో కలిసి సీఎం సోమవారం సమీక్ష చేశారు. నియోజకవర్గం పరిధిలోని ఎనిమిది మండలాలు, రెండు మునిసిపాలిటీల ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులతో వేర్వేరుగా సమావేశం అయ్యారు. మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమైన సమీక్ష రాత్రి ఏడు గంటల వరకు కొనసాగింది. అనంతరం ఆయన తన నివాసానికి వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. కొడంగల్‌లో కాంగ్రెస్‌ను ఓడించి, రేవంత్‌రెడ్డిని కింద పడేయాలని కొన్ని శక్తులు కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. తెరచాటున చేస్తున్న ఆ కుట్రలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. రేవంత్‌రెడ్డిని ఎందుకు కింద పడేయాలనే కుట్ర జరుగుతున్నదో ప్రజలు ఆలోచించాలన్నారు. ఇదంతా రేవంత్‌రెడ్డిని దెబ్బతీయడం కాదని కొడంగల్ అభివృద్ధినే దెబ్బతీయడమేనని అన్నారు. కొడంగల్ నియోజకవర్గంపై జరిగే కుట్రలు, కుతంత్రాలను తిప్పికొట్టాలని, కాంగ్రెస్ కార్యకర్తలు మరో రేవంత్‌రెడ్డిగా మారి పనిచేయాలని పిలుపునిచ్చారు. తాను ఎక్కడున్నా తన గుండె చప్పుడు కొడంగలేనని స్పష్టం చేశారు. తనతో కొట్లాడే హక్కు.. తనతో పట్టుపట్టి పని చేయించుకునే అధికారం మీకున్నదని ఆయన ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలతో పేర్కొన్నారు. వంద రోజుల్లో కొడంగల్ నియోజకవర్గానికి మెడికల్, ఇంజనీరింగ్, వెటర్నరీ, నర్సింగ్ జూనియర్, డిగ్రీ కాలేజీలు తెచ్చుకున్నామని, వందల కోట్ల రూపాయలతో తండాలకు రోడ్లు మంజూరు చేసుకున్నామని, రూ.4,000 కోట్లతో నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని తెచ్చుకున్నామనే ప్రజలకు వివరించాలని సూచించారు. బీజేపీ జాతీయ ఉపా ధ్యక్షురాలు అరుణమ్మ కొడంగల్‌ను అభివృద్ధి చేయనీయకుండా కుట్ర చేస్తున్నారని ధ్వజమెత్తారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించేందుకు బీజేపీ, బీఆర్‌ఎస్ కుట్రలు చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం కొడంగల్‌లో ఏ ఒక్కరికైనా డబుల్ బెడ్రూం ఇచ్చిందా? అని ప్రశ్నించారు. మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి వంశీచందర్‌రెడ్డి మాట్లాడుతూ, లోక్‌సభ ఎన్నికల్లో కొడంగల్ నుంచి అత్యధిక మెజార్టీ ఇవ్వాలని కోరారు. కొడంగల్ నియోజకవర్గ ఇంచార్జి తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో కాంగ్రెస్ శ్రేణులు రెట్టింపు ఉత్సాహంతో పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, టీపీసీసీ ప్రతినిధి ఎండీ. యూసూప్ ఆయా మండలాలు, మునిసిపాలిటీల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళ హత్య

- వివాహేతర సంబంధమే కారణం
- పోలీసులకు లొంగిపోయిన నిందితుడు


చిట్టెమ్మ (ఫైల్)


నిందితుడు శివకుమార్

బిజినేపల్లి, ఏప్రిల్ 8: వివాహేతర సంబంధం ఓ మహిళ ప్రాణాలు తీసింది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం వెల్గొండ శివారులో చోటు చేసుకుంది. నాగర్‌కర్నూల్ డీఎస్పీ శ్రీనివాసులు సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కల్వకుంట్ల తండాకు చెందిన మోతి తన కూతురు చిట్టెమ్మ(28)ను ఖిల్లాఘణపూర్ మండలంలోని మామిడమాడ తండాకు చెందిన రమేష్‌కు ఇచ్చి వివాహం చేశారు. రెండేళ్ల కిందట ఆమె గర్భం దాల్చింది. ఈ క్రమంలో అనారోగ్యానికి గురైన ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరిశీలించి, సమస్య ఉండటంతో గర్భసంచి తొలగించారు. ఈ క్రమంలో చిట్టెమ్మ, భర్త రమేష్‌లకు బిజినేపల్లిలో ఓ ఇల్లు అద్దెకు ఇప్పించి ఉంచారు. బిజినేపల్లికి చెందిన శివకుమార్‌తో చిట్టెమ్మకు ఏర్పడ్డ పరిచయం వివాహేతర సంబంధానికి దారి తీసింది. కొద్ది రోజులుగా శివకుమార్ చిట్టెమ్మను వేధింపులకు గురి చేయడం మొదలు పెట్టాడు. ఈ విషయాన్ని ఆమె తన తల్లిదండ్రులతో చెప్పింది. దాంతో కూతురు, అల్లుడిని జడ్చర్లకు మకాం మార్పించారు. ఆదివారం కల్వకుంట్ల తండాకు వచ్చిన చిట్టెమ్మకు తల్లిదండ్రులు సర్ది చెప్పి జడ్చర్లకు పంపించారు. సాయంత్రం తిమ్మాజిపేటలో ఉన్నానని తల్లి మోతితో ఫోన్‌లో చెప్పింది. తర్వాత తల్లి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ అని వచ్చింది. చిట్టెమ్మతో వివాహేతర సంబంధం పెట్టుకున్న శివకుమార్ ఆదివారం రాత్రి వెల్గొండ శివారులోని తన పొలంలో గొంతునులిమి చంపాడు. తర్వాత పత్తి కట్టెల్లో దాచిపెట్టాడు. సోమవారం ఉదయం నాగర్‌కర్నూల్ పోలీసు స్టేషన్‌లో లొంగిపోయాడు. విషయం తెలుసుకున్న డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ కనకయ్య, ఎస్ఐ నాగశేఖర్ రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించారు. చిట్టెమ్మ తల్లి మోతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

దైవ దర్శనానికి వచ్చి అనంతలోకాలకు..

గద్వాల, ఏప్రిల్ 8 : దైవ దర్శనానికి వచ్చిన ఓ కుటుంబంలో విషాదం చోటు చేసుకున్నది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం ఎల్కూర్ గ్రామానికి చెందిన వెంకట్రాములు, కృష్ణవేణిలు తమ పిల్లలతో కలిసి సోమవారం ఉదయం గద్వాల మండలం శెట్టిఆత్మకూర్ గ్రామంలో నర్సింహస్వామి దర్శనానికి వచ్చారు. స్వామివారికి నైవేద్యం చేసే పనిలో దంపతులు ఉన్నారు. వారి కుమారుడు సంతోష్(14) ఆలయం పక్కనే ఉన్న బావి వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు బావిలో పడ్డాడు. దీనిని ఎవరు గమనించలేదు. కొద్దిసేపటి తర్వాత కుమారుడు లేడని తల్లిదండ్రులు వెతికే పనిలో పడ్డారు. బావి వద్ద అతని చెప్పులు గమనించి గ్రామస్థుల సహాయంతో బావిలో గాలించగా అతని మృతదేహం లభ్యమైంది. కుమారుడి మృతితో తల్లిదండ్రుల రోదనలు అందరిని కలిచివేశాయి. వీరికి ఇద్దరు కూతుళ్లు కాగా, కుమారుడు ఒక్కరే. ఘటనపై తమకెలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై పర్వతాలు తెలిపారు.

ఉగ్ర భానుడు

- వడ్డేపల్లిలో 44.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత
- జోగుళాంబ గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో తీవ్రమైన ఎండలు


వనపర్తి మండలం అచ్యుతాపురం గ్రామం సమీపంలో నీరందక ఎండిన వరి పైరు


కోయిలకొండ మండలం అంకిళ్ల గ్రామ శివారులో ఎండకు పశువులు చెట్టు కింద పడుకోగా వాటి పక్కనే సేదతీరుతున్న కాపరులు

మహబూబ్‌నగర్/నారాయణపేట/నాగర్‌కర్నూల్ టౌన్/గద్వాల/వనపర్తి అర్బన్, ఏప్రిల్ 8 : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతూనే ఉన్నాయి. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటికి రావడానికి జయపడుతున్నారు. సోమవారం జోగుళాంబ గద్వాల జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదుకాగా, మహబూబ్‌నగర్ జిల్లాలో మాత్రం కాస్త తగ్గాయి.

- జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లిలో 44.1 డిగ్రీలు, గద్వాలలో 43.7, ధరూర్‌లో 43, అలంపూర్‌లో 42.9, ఇటిక్యాలలో 42.6, కేటీదొడ్డిలో 42.4, రాజోలిలో 42.4. అయిజలో 42.2, ఉండవెల్లిలో 42.1, మల్దకల్‌లో 41.8, మానవపాడులో 40.7, గట్టులో 40 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.
- వనపర్తి జిల్లా పాన్‌గల్ మండల పరిధిలోని కేతేపల్లిలో అత్యధికంగా 43.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. పెబ్బేరు 42.9, చిన్నంబావి 42.8, ఆత్మకూరు 42.5, కొత్తకోట 42.4, అమరచింత 41.9, మదనాపూర్ 41.7, వీపనగండ్ల 41.2, పెద్దమందడి, గోపాల్‌పేట, ఘణపూర్ 41.1, శ్రీరంగాపూర్ 40.5, వనపర్తి 40.2, రేవల్లిలో 39.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.
- నాగర్‌కర్నూలు జిల్లా కేంద్రం, అచ్చంపేటలలో 43.0 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత, కొల్లాపూర్‌లో 42.2, ఉప్పునుంతలలో 42.0, బిజినేపల్లిలో 41.8, వంగూరులో 41.7, పెంట్లవెల్లిలో 41.6, పదరలో 41.2, పెద్దకొత్తపల్లిలో 41.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.
- మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేటలో 41.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అడ్డాకులలో 41.2, సీసీకుంటలో 40.8, గండీడ్, మహ్మదాబాద్, దేవరకద్రలలో 40.2, కోయిల్‌కొండలో 40.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా మిగతా అన్ని మండలాలలో 37, 38, డిగ్రీలు నమోదుకావడంతో కాస్త ఊరట లభించింది. ఇక సాయంత్రానికి చల్లటి గాలులు వీడంతో వడగాలి, ఉక్కపోత నుంచి జనం చాలావరకు ఉపశమనం పొందారు. ఉగాది పండగకు ముందు వాతావరణంలో వచ్చిన మార్పునకు జనం ఊపిరిపీల్చుకుంటున్నారు.
- నారాయణపేట జిల్లాలో 41 డిగ్రీలు గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా, కనిష్ఠంగా 26 డిగ్రీలు నమోదైంది. కోస్గిలో 40, మాగనూర్ మండలంలో 39 డిగ్రీలు, కృష్ణ మండలంలో 32 డిగ్రీలు నమోదైంది.


ధన్వాడ మండలం కొండ్రోనిపల్లిలో ప్లాస్టిక్ టబ్బులో నీళ్లు పోసి పశువులకు తాపుతున్న రైతు

ప్రాంతీయ పార్టీలు లేకుండా కుట్రలు

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



మాట్లాడుతున్న సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ టౌన్, ఏప్రిల్ 8 : దేశంలో ప్రాంతీయ పార్టీలు లేకుండా మట్టుపెట్టాలని బీజేపీ, కాంగ్రెస్‌లు కుట్రలు చేస్తున్నాయని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో నాగర్‌కర్నూల్ పార్లమెంటు నియోజకవర్గం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కువ సీట్లు ఉన్న రాష్ట్రాలను వదిలేసి తెలంగాణలో కేసీఆర్ మీద కొట్లాడితే రాహుల్‌గాంధీ దేశానికి ప్రధానమంత్రి ఎలా అవుతాడో కాంగ్రెస్ నాయకులు సమాధానం చెప్పాలన్నారు. ఉమ్మడి జిల్లాలో చేపట్టిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వనందుకు బీజేపీకి ఓట్లేయాలా అని ప్రశ్నించారు. రైతులకు సాగునీరు, కరెంటు కష్టాలను తెచ్చిన కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో భాగంగా కల్యాణలక్ష్మి చెక్కుతో పాటు తులం బంగారంతో గ్రామాల్లోకి రావాలని, లేని పక్షంలో ప్రజలే మిమ్మల్ని నిలదీస్తారని హెచ్చరించారు. కేసీఆర్ ఇచ్చిన ఎకరాకు రూ.10 వేల రైతు బంధు ఇవ్వడానికి చేతకాలేదని, ఆచరణలో సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఎకరాకు రూ.15 వేలు ఇచ్చి ప్రజలను ఓట్లు అడగాలని డిమాండ్ చేశారు. ప్రతీ కార్యకర్త కష్టపడి పని చేసి హార్వర్డ్ యూనివర్సిటీలో చదివిన ఆర్‌ఎస్‌పీని నాగర్‌కర్నూల్ ఎంపీగా గెలిపించాలని ఆయన కోరారు. మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలుపు కోసం అవసరమైతే పాదయాత్ర చేస్తానన్నారు. మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు మాట్లాడుతూ గడప గడపకు వెళ్లి పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ పేద, బడుగు బలహీన వర్గాల బిడ్డల అభ్యున్నతికే రాజకీయాల్లోకి వచ్చానని, ఎన్నికల్లో గెలిపిస్తే ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయనన్నారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ శాంతకుమారి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు అభిలాష్‌రావు, బైకని శ్రీనివాస్‌యాదవ్, మునిసిపల్ చైర్‌పర్సన్ కల్పన, వైస్ చైర్మన్ బాబురావు, బీఆర్‌ఎస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూంలో సీసీ కెమెరాల తనిఖీ



స్ట్రాంగ్‌రూం వద్ద సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జి.రవినాయక్

మహబూబ్‌నగర్(కలెక్టరేట్), ఏప్రిల్ 8 : మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గ శాసన మండలి ఉప ఎన్నిక పోలింగ్ బ్యాలెట్ బాక్స్‌లను భద్రపరచిన స్ట్రాంగ్‌రూంను సోమవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జి.రవినాయక్ తనిఖీ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలో భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాలను సోమవారం రాత్రి ఆయన పరిశీలించారు.

గైర్హాజరైన పోలింగ్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ

మహబూబ్‌నగర్(కలెక్టరేట్), ఏప్రిల్ 8 : పార్లమెంట్ ఎన్నికల కోసం పీవో, ఏపీవో, ఓపీవోలకు ఎన్నికల శిక్షణా తరగతులు ఈనెల 6,7,8 తేదీల్లో నిర్వహించారు. మొత్తం 4,727 ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఉత్తర్వులు అందజేయగా ఇందులో 160 మంది గైర్హాజరయ్యారు. వీరికి మరో అవకాశంగా ఈనెల 10న మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో రూమ్ నెంబర్-1లో శిక్షణ తరగతులు ఏర్పాటు చేసినట్లు రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ జి.రవినాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అవకాశాన్ని గైర్హాజరైన ఎన్నికల సిబ్బంది వినియోగించుకోవాలని సూచించారు. మళ్లీ గైర్హాజరైన సిబ్బందిపై ఎన్నికల నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

నేటి నుంచి
అంతర్రాష్ట్ర ఓపెన్ కబడ్డీ టోర్నమెంట్

అయిజ, ఏప్రిల్ 8 : జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం ఈడిగోనిపల్లి గ్రామంలో అంతర్‌రాష్ట్ర ఓపెన్ కబడ్డీ టోర్నమెంట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉగాది పర్వదినం సందర్భంగా ఈనెల తొమ్మిది నుంచి పదో తేదీ వరకు పోటీలు నిర్వహించనున్నామని వివరించారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ పేర్లను గ్రామంలోని నరేష్, నర్సింహులు, కృష్ణ, పరమేష్‌ల వద్ద నమోదు చేసుకోవాలని వారు సూచించారు.

ఉచిత కోచింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 8 : సివిల్ సర్వీసెస్‌లో ప్రిలిమ్స్ కమ్ మెయిన్స్ ఉచిత కోచింగ్‌కు మైనార్టీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి రవీంద్రనాథ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వందమంది మైనార్టీ అభ్యర్థులకు ఉచితంగా కోచింగ్ ఇస్తారని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర మైనారిటీస్ స్టడీ సర్కిల్‌లో మొదటిసారి ప్రవేశానికి అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. యూపీఎస్సీ (సీశాట్-2024-25) సివిల్ సర్వీసెస్ అప్టిట్యూడ్ టెస్ట్‌లో ప్రవేశానికి రాష్ట్రంలో సాధారణ, ప్రొఫెషనల్ డిగ్రీ పూర్తిచేసిన వారు ఈనెల 16వ తేదీ వరకు ట్రీమ్సిస్ తెలంగాణ వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పరీక్ష ఈనెల 28న ఉదయం 10:30 నుంచి 12:30 గంటల వరకు అన్ని జిల్లా కేంద్రాల్లోని మైనార్టీ గురుకుల్లాలో నిర్వహిస్తారని ఆయన వివరించారు.

మద్యం పట్టివేత

అలంపూర్ చౌరస్తా, ఏప్రిల్ 8 : జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలం పుల్లూరు గ్రామంలో ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది నిర్వహించిన తనిఖీలో మద్యం పట్టుబడింది. ఏఎస్సై సుబ్బారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న ఇటిక్యాల మండల పంచాయతీరాజ్ ఏఈ పాండురంగ సోమవారం తన సిబ్బందితో కలిసి పుల్లూరు గ్రామంలో తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో నరేష్ అనే వ్యక్తి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 41.72 లీటర్ల మద్యం లభించింది. వీటి విలువ రూ.15800లుగా నిర్ధారించి, ఇద్దరు నిందితులపై ఫిర్యాదు చేసి, మద్యం అప్పగించారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

ట్రాక్టర్ కింద పడి ఉపాధి కూలీకి గాయాలు

బిజినేపల్లి, ఏప్రిల్ 8 : నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం వట్టెం గ్రామంలో ట్రాక్టర్ కింద పడి ఉపాధి కూలీకి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కిష్టమ్మ సోమవారం గ్రామ శివారులోని పెద్ద చెరువులో ఉపాధి హామీ పనిలో భాగంగా నల్లమట్టి తీసే పనికి వెళ్లింది. పనుల అనంతరం తిరిగి ఇంటికి వెళ్లేందుకు గాను ట్రాక్టర్ ఎక్కి కూర్చున్నది. ప్రమాదవశాత్తు కింద పడడంతో ట్రాక్టర్ ఆమె కాలు పైనుంచి పోయింది. దీంతో ఆమె కాలు విరిగింది. ఆమెతో పాటు ఉన్న మిగతా ముగ్గురు కూలీలకు స్వల్ప గాయాలయ్యాయి. కిష్టమ్మను తోటి కూలీలు, ఫీల్డ్ అసిస్టెంట్ రాజశేఖర్‌లు వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించి కాలుకు కట్టు కట్టించారు. ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనం నడపడం వల్లే ప్రమాదం జరిగిందని బాధితులు వాపోతున్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితురాలి బంధువులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

చారకొండ, ఏప్రిల్ 8 : నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలంలోని గోకారం చెరువు నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని ఎర్రవల్లితండాకు చెందిన నేనావత్ రాంపాల్ నాయక్ తన ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తుండగా సోమవారం తెల్లవారుజామున పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

అమరచింతలో అర్ధరాత్రి దొంగల హల్‌చల్

» పాల దుకాణంలో రూ.60 వేల నగదు చోరీ



అమరచింతలోని పాల దుకాణం షట్టర్‌ను ఇనుప రాడ్లతో పెకిలించిన దృశ్యం

అమరచింత, ఏప్రిల్ 8 : వనపర్తి జిల్లా అమరచింత మండల కేంద్రంలో వారం రోజులుగా దొంగలు హల్‌చల్ సృష్టిస్తున్నారు. తాజాగా ఆదివారం రాత్రి ప్రధాన రహదారిలో ఉన్న కేజీఎస్ కోడిగుడ్లు, పాల దుకాణంలో దొంగలు షాప్ షట్టర్‌ను ఇనుప రాడ్లతో పెకిలించి కౌంటర్‌లో ఉన్న రూ.60వేల నగదును చోరీ చేశారు. తెల్లవారుజామున పాల వ్యాన్ కోసం ఎప్పటిలా షాప్ యజమాని ఖాజా దుకాణానికి రాగా అప్పటికే షట్టర్ తీసి ఉండడంతో నగదు చోరీ అయినట్లు నిర్ధారించారు. విషయంపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అంతేగాక గతవారం ప్రధాన రహదారిపై ఉన్న ఓ మెడికల్ షాపు, ల్యాబ్ షాపులను రాడ్లతో పెకిలించే ప్రయత్నం చేసినట్లు తెలిసింది. రెండురోజుల క్రితం మునిసిపాలిటీ కేంద్రంలోని ఎనిమిదో వార్డులో ఓ బైక్‌ను అపహరించేందుకు కూడా యత్నించారు.

చిత్తనూర్ ఇథనాల్‌తో పర్యావరణ విధ్వంసం

» పాలసీని తెచ్చిన బీజేపీ, బీఆర్ఎస్‌ను నిలదీద్దాం
» ఈ పాలసీపై కాంగ్రెస్ వైఖరి ఏంటో చెప్పాలి
» 18న హైదరాబాద్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం
» చిత్తనూర్ ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ



కరపత్రం విడుదల చేస్తున్న నాయకులు

పాలమూరు, ఏప్రిల్ 8 : పర్యావరణ విధ్వంసానికి కారణమవుతున్న చిత్తనూర్ ఇథనాల్ కంపెనీని తక్షణమే రద్దు చేయాలని చిత్తనూర్ ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ ప్రతినిధి బృందం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సోమవారం జిల్లా కేంద్రంలోని టీఎఫ్‌టీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నాయకులు మాట్లాడారు. ఇథనాల్ పాలసీని తీసుకువచ్చిన బీజేపీ, బలపరిచిన బీఆర్ఎస్ పార్టీల నాయకులు పార్లమెంట్ ఎన్నికల ఓట్ల కోసం వస్తే నిలదీయాలని పిలుపునిచ్చారు. ఇథనాల్ పాలసీపై కాంగ్రెస్ పార్టీ తమ వైఖరి ఏంటో బయటపెట్టాలన్నారు. 18వ తేదీన హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సుమారు మూడేళ్లుగా చిత్తనూర్, ఎక్లాస్‌పూర్, జిన్నారం గ్రామాల నడుమ ఏర్పాటు చేసిన చిత్తనూర్ ఇథనాల్ కంపెనీకి వ్యతిరేకంగా పోరాడుతున్నామని పేర్కొన్నారు. జూరాల ఆర్గానిక్ ఫార్మ్స్ అండ్ ఆగ్రో ఇండస్ట్రీస్ వారు పండ్ల రసాల ఉత్పత్తి పేరుతో చవకగా, తేరగా భూములు కొనుగోలు చేసి పండ్ల తోటలు కాకుండా ఇథనాల్ ఉత్పత్తి కంపెనీ ఏర్పాటుకు పూనుకోవడంతో మనం నిరంతరం పోరాటంలో ఉన్నామని తెలిపారు. ప్రజల జీవించే హక్కు, రక్షణ, పర్యావరణ పరిరక్షణ, స్థానిక వనరుల దురాక్రమణ, నివారణ లక్ష్యాలతో మన జీవితాల బాగుకోసం పోరాడుతున్నామని వివరించారు. కంపెనీ యాజమాన్యం స్థానిక ప్రజలకు, రెవెన్యూ, అటవీ, పర్యావరణ, కాలుష్య నియంత్రణ, పోలీసు, న్యాయ తదితర శాఖలకు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అబద్ధాల మీద అబద్ధాలు చెప్పిందన్నారు. నిజానిజాలను పరిశీలించాల్సిన అన్ని శాఖలు, ప్రభుత్వం కంపెనీకి లోబడి పనిచేశాయన్నారు. శాంతియుతంగా పోరాటం చేస్తున్న మనమీద అణచివేత, నిర్బంధం, కేసులు, రౌడీషీట్లు ప్రయోగించటం దారుణమన్నారు. 22 అక్టోబర్ 2023న జరిగిన అక్రమ లాఠీచార్జిపై జ్యుడీషియల్ విచారణ జరిపి కారకులైన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. తెలంగాణ వ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న 20 ఇథనాల్ కంపెనీలను ఎత్తివేయాలన్నారు. అదేవిధంగా, చిత్తనూర్, ఎక్లాస్‌పూరు, జిన్నారం, కన్ననూర్ తదితర గ్రామాల రైతాంగంపై, ఉద్యమ నాయకత్వంపై బనాయించిన అక్రమ కేసులను, రౌడీషీట్‌ను ఎత్తివేయాలన్నారు. చిత్తనూర్ ఇథనాల్ కంపెనీ దురాక్రమణలో ఉన్న నక్షబాటలను విడుదల చేయాలన్నారు. సమావేశంలో పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ ఎం.రాఘవాచారి, టీఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎం ఖలీల్, చైతన్య మహిళా సంఘం రాష్ట్ర కోకన్వీనర్ శ్రీదేవి, కుల నిర్మూలన పోరాట సమితి నాయకులు బండారి నరసప్ప, ఏఐఎస్ఎఫ్ నాయకులు బిసమొల్ల నాగరాజు, రైతు ఉచ్చిల్ల రామచంద్రయ్య, కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి నాయకుడు బండారి లక్ష్మయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలకే గ్యారెంటీ లేదు

» దేశ భవిష్యత్ కోసం బీజేపీని ఆదరించాలి
» పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ

గద్వాల, ఏప్రిల్ 8 : 'రాష్ట్రంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలకే గ్యారెంటీ లేదు.. ఇప్పుడు రాహుల్‌గాంధీ వచ్చి దేశంలో ప్రభుత్వం ఏర్పాటుచేస్తే ఐదు గ్యారెంటీలను అమలు చేస్తామంటున్నారు. కాంగ్రెస్ గెలిచేది లేదు.. గ్యారెంటీలు అమలు చేసేది లేదని' బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. సోమవారం డీకే బంగ్లాలో ఆమె పార్టీ ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇచ్చిన హామీలను నెరవేర్చని కాంగ్రెస్ పార్టీకి ఓట్లు అడిగే హక్కు లేదని అన్నారు. అసెంబ్లీ ఎన్నికలప్పుడు గ్యారెంటీల పేరు చెప్పి మోసం చేశారని, ఇప్పుడు ఐదు గ్యారెంటీల పేరుతో మోసం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. దేశం కోసం, దేశ భవిష్యత్ కోసం వికసిత భారత్ లక్ష్యంగా ముందుకు వెళ్తున్న నరేంద్రమోదీని ఆశీర్వదించాలని ఆమె కోరారు. ప్రతీ కార్యకర్త బీజేపీ గెలుపు కోసం కష్టపడాలని ఆమె సూచించారు. సమావేశంలో వనపర్తి జడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయ్యంగారి ప్రభాకర్, విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ రామాంజనేయులు, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి, నాయకులు పాల్గొన్నారు.

ప్రజల కోసం పనిచేసే వారిని ప్రజలే కాపాడుకుంటారు

» జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపకుడు డాక్టర్ బ్రహ్మారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ బ్రహ్మారెడ్డి

వనపర్తి వైద్యవిభాగం, ఏప్రిల్ 8 : ప్రతీ వైద్యుడిని, పీఎంపీ, ఆర్‌ఎంపీని కాపాడేది జనమేనని, ప్రజల కోసం పనిచేసే వారిని ప్రజలే కాపాడుకుంటారని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రముఖ వైద్యుడు డాక్టర్ బ్రహ్మారెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో మహాదేవ చారిటబుల్ ట్రస్ట్ ఉరుమల్ల విశ్వం ఆధ్వర్యంలో ఆర్‌ఎంపీ, పీఎంపీల వైద్య విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జయచంద్రమోహన్‌తో కలిసి ఆయన హాజరై, మాట్లాడారు. వైద్యం చేయడమే వైద్యుల పని కాదని, రోగాలకు గురికాకుండా ప్రజలను చైతన్యం చేయడం కూడా వైద్యంతో సమానమన్నారు. గ్రామీణ వైద్యుడంటే గ్రామాల్లోని వందమందితో సన్నిహితంగా మెలిగే ఒక నేస్తమని పాలకులు గుర్తించాలన్నారు. డబ్బులు సంపాదించాలంటే వైద్య వృత్తిని ఎంచుకోవడంతో సమాజం కలుషితమవుతోందన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జయచంద్రమోహన్ మాట్లాడుతూ సహజ సిద్ధమైన ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలని, స్త్రీలు శారీరక శ్రమను తగ్గించుకోవడం వల్ల అధిక సంఖ్యలో ఆపరేషన్లు అవుతున్నాయని అన్నారు. మొదటగా ఆర్‌ఎంపీలు, పీఎంపీలు మారి ప్రజలను చైతన్యం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ మురళీధర్, మహాదేవ ఛారిటబుల్ ట్రస్ట్ ఉరుమల్ల విశ్వం, డాక్టర్ సదన్, డాక్టర్ సిద్ధార్థ, కవి జనజ్వాల, సత్తార్, గంధం నాగరాజు, ఆర్‌ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్, ప్రధాన కార్యదర్శి చిన్నడ్యానియల్, పట్టణ అధ్యక్షుడు గంధం ప్రసాద్, స్వామినాయుడు, కృపాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో వ్యక్తి రిమాండ్

» వివరాలు వెల్లడించిన ఎస్పీ యోగేష్‌గౌతమ్



విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న మాట్లాడుతున్న ఎస్పీ యోగేష్‌గౌతమ్

నారాయణపేటటౌన్, ఏప్రిల్ 8 : నారాయణపేట జిల్లా కేంద్రంలో ఈనెల ఐదో తేదీన ఓ వ్యక్తిని హత్య చేసిన కేసులో నిందితుడిని పోలీసులు పట్టుకున్నారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ యోగేష్‌గౌతమ్ హత్య కేసు వివరాలను వెల్లడించారు. జిల్లా కేంద్రంలో ఈనెల ఐదో తేదీన అర్ధరాత్రి సమయంలో జిల్లా ఆసుపత్రి వెనుకాల గోవధశాల వద్ద ఓ వ్యక్తిని రాయితో కొట్టి హత్య చేసి నిప్పంటించారు. పోలీసులు మృతదేహాన్ని గుర్తించి అతడి సోదరుడు దాసరి నారాయణకు సమాచారమందించగా అతను ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహం తన తమ్ముడు మారుతిగా గుర్తించారు. నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామన్నారు. డీఎస్పీ లింగయ్య ఆధ్వర్యంలో సీఐ శివశంకర్, ఎస్సై వెంకటేశ్వర్లు, సిబ్బందితో నిందితుడిని పట్టుకొని విచారించామన్నారు. పట్టణానికి చెందిన నజీర్ అలియాస్ ఉప్పరి నర్సింహులు హత్యకు పాల్పడినట్లు విచారణలో తేలింది. మృతుడు మారుతి, ఉప్పరి నర్సింహులుకు మద్యం విషయంలో గొడవ జరిగింది. ఆ గొడవ హత్యకు దారి తీసినట్లు ఎస్పీ తెలిపారు. దాసరి మారుతిని రాయితో కొట్టి చంపిన తరువాత నిందితుడు నర్సింహులు చొక్కాపై రక్తపు మరకలు పడడంతో దానిని మృతదేహంపై పారేసి నిప్పంటించాడు. నిందితుడు నర్సింహులుకు తల్లిదండ్రులు, తోబుట్టువులు ఎవరూ లేరు. చిన్నతనంలోనే తండ్రి మరణించగా కొద్దికాలం క్రితం తల్లి కూడా మరణించింది. దాంతో నర్సింహులు జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు చేసి జైలుకు కూడా వెళ్లి వచ్చాడు. ఇతడిపై నారాయణపేట పోలీస్‌స్టేషన్‌లో సస్పెక్టెడ్ షీట్ కూడా ఉందన్నారు. కేసును ఛేదించడంలో కృషి చేసిన సీఐ శివశంకర్, ఎస్సై వెంకటేశ్వర్లు, పోలీసులు ఆంజనేయులు, రాములును ఎస్పీ అభినందించారు. అనంతరం వారికి రివార్డులను అందించారు. కార్యక్రమంలో డీఎస్పీ లింగయ్య ఉన్నారు.

వాహనాల తనిఖీ ముమ్మరం

» పట్టుబడుతున్న నగదు



చారకొండలో పట్టుకున్న నగదుతో ఎస్సై రాజశేఖర్

చారకొండ/ఊర్కొండ/వెల్దండ/గద్వాల క్రైం/గోపాల్‌పేట/దామరగిద్ద/కృష్ణ, ఏప్రిల్ 8 : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో భాగంగా పోలీసులు వాహనాల తనిఖీని ముమ్మరం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ పోలీస్‌స్టేషన్ వద్ద ఏర్పాటుచేసిన అంతర్‌జిల్లా చెక్‌పోస్టు వద్ద ఎస్సై రాజశేఖర్ ఆధ్వర్యంలో సోమవారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. చారకొండలోని కస్తూర్బాగాంధీ పాఠశాల వద్ద డీసీఎంలో రూ.2,32,400 నగదు పట్టుబడిందని ఎస్సై తెలిపారు. నల్గొండ జిల్లా మాల్ నుంచి డిండికి వెళ్తున్న పాల కృష్ణ వద్ద డబ్బులు పట్టుబడినట్లు చెప్పారు. పట్టుకున్న నగదుకు సంబంధించి ఎలాంటి పత్రాలు అతని వద్ద లేకపోవడంతో డబ్బును జిల్లా గ్రీవెన్స్ కమిటీకి పంపించినట్లు ఎస్సై పేర్కొన్నారు. తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్స్ శ్రీనివాసులు, శ్రీశైలం, కానిస్టేబుల్స్ భాస్కరచారి, మల్లేష్, జంగయ్య ఉన్నారు. అదేవిధంగా, ఊర్కొండ మండలం కల్వకుర్తి-జడ్చర్ల ప్రధాన రహదారిపై ముచ్చర్లపల్లి గ్రామం వద్ద ఏర్పాటు చేసిన అంతర్ జిల్లా చెక్‌పోస్ట్ వద్ద సోమవారం రూ.1,71,440 నగదును పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎసై వీరబాబు తెలిపారు. తనిఖీలో ఏఎస్సై ఇస్మాయిల్, కానిస్టేబుల్ ఉన్నారు. వెల్దండ మండల కేంద్రంలోని హైదరాబాద్ - శ్రీశైలం ప్రధాన రహదారిపై సోమవారం సాయంత్రం పోలీసులు చేపట్టిన వాహనాల తనిఖీలో ఓ వ్యక్తి నుంచి రూ.మూడు లక్షల 80 వేలు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట ఎస్సై రవి ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టగా మహబూబ్‌నగర్‌కు చెందిన తుల్జారాంజీ అనే వ్యక్తి తన కారులో రూ.3 లక్షల 80 వేలు ఉన్నట్లు గుర్తించారు. నగదుకు సంబంధించి ఆధారాలు లేకపోవడంతో నగదును జిల్లా గ్రీవెన్స్‌కు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

జోగుళాంబ గద్వాల జిల్లా కేటీ దొడ్డి పోలీస్‌స్టేషన్ పరిధిలోని నందిన్నె చెక్‌పోస్టు వద్ద పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీలో రూ.2 లక్షల 21 వేల నగదు పట్టుబడింది. తనిఖీల్లో భాగంగా ఓ వాహనంలో ఎలాంటి రశీదు లేని రూ.1.48 వేలు, మరో వాహనంలో రూ.73 వేలు గుర్తించి సీజ్ చేసినట్లు ఎస్పీ రితిరాజ్ సోమవారం తెలిపారు. నగదును జిల్లా ఎన్నికల గ్రీవెన్స్ కమిటీకి అప్పగించినట్లు చెప్పారు. వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం బుద్దారం గ్రామ పరిధిలోని గండి ఆంజనేయస్వామి దేవాలయం వద్ద ఏర్పాటుచేసిన జిల్లా సరిహద్దు చెక్‌పోస్టు వద్ద రూ.64 వేలు పట్టుబడినట్లు ఎస్సై హరిప్రసాద్ తెలిపారు. బిజినేపల్లి మండలం శానాయిపల్లి గ్రామానికి చెందిన శివయ్య తన కారులో రూ.64 వేల నగదును వనపర్తికి తీసుకెళ్తుండగా చెక్‌పోస్టు వద్ద పోలీసులు కారు ఆపి తనిఖీలు నిర్వహించారు. శివయ్య వద్దనున్న నగదుకు సంబంధించి ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం కానుకుర్తి చెక్‌పోస్టు వద్ద రూ.ఒక లక్షా ఎనిమిది వేలు, కృష్ణ మండలం కృష్ణ బ్రిడ్జి చెక్‌పోస్టు వద్ద రూ.56 వేల నగదు పట్టుకున్నట్లు ఎస్పీ యోగేష్‌గౌతమ్ తెలిపారు. పట్టుబడిన నగదును గ్రీవెన్స్ కమిటీకి పంపించినట్లు ఆయన చెప్పారు.

శ్రీశైలం ఘాట్ రోడ్డులో ట్రాఫిక్‌జామ్

» ఇబ్బంది పడిన ప్రయాణికులు



ఎడమ పాతాళగంగ వద్ద ట్రాఫిక్‌జామ్‌తో నిలిచిపోయిన వాహనాలు

దోమలపెంట, ఏప్రిల్ 8 : శ్రీశైలం ఘాట్ రోడ్డు ఆంధ్ర - తెలంగాణ సరిహద్దులో సోమవారం వాహనాల రాకపోకలతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. మంగళవారం ఉగాది పండుగ నేపథ్యంలో కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు శ్రీశైలం మల్లన్న దర్శనం కోసం వాహనాల్లో తరలివస్తున్నారు. సోమవారం ఉదయం శ్రీశైలం - హైదరాబాద్ నుంచి వాహనాల రాకపోకలు అధికంగా ఉండటంతో ఎడమ పాతాళగంగ నుంచి సున్నిపెంట వరకు ట్రాఫిక్ జామ్ ఏర్పడి వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఘాట్‌లో రోడ్డు ఇరుకుగా ఉండటం.. వాహనాలు అధిక మొత్తంలో రావడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడి దాదాపు మూడు గంటల పాటు ప్రయాణికులు, శ్రీశైలం వెళ్లే భక్తులు ఇబ్బంది పడ్డారు. వాహనాలు ఇంకా వచ్చే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ జామ్ ఏర్పడకుండా దోమలపెంట, పాతాళగంగ, వటువర్లపల్లి, ఈగలపెంట గ్రామాల్లో వాహనాలు నిలుపకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నట్లు ఈగలపెంట ఎస్సై వీరమల్లు పేర్కొన్నారు.

నల్లమల అడవుల్లో
చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే చర్యలు

» దోమలపెంట ఎఫ్ఆర్‌వో గురుప్రసాద్

దోమలపెంట, ఏప్రిల్ 8 : నల్లమల అటవీ ప్రాంతం అమ్రాబాద్ అభయారణ్యంలో చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని దోమలపెంట ఎఫ్ఆర్‌వో గురుప్రసాద్ హెచ్చరించారు. సోమవారం వటువర్లపల్లి బేస్ క్యాంపులో ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. నల్లమల అడవుల్లో ఉద్దేశపూర్వకంగా మంటలు పెట్టినా, జంతువులను వేటాడినా, చెట్లను నరికినా, జంతువుల ఆవాసాల్లో సంచరించినా, అటవీశాఖ నిబంధనలకు విరుద్ధంగా అనుమతి లేకుండా వాహనాలు అడవుల్లోకి వెళ్లినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అంతేకాకుండా అటవీ ఉత్పత్తుల సేకరణకు వెళ్లేవారు, పశువులు, గొర్రెలు, మేకల కాపర్లు అటవీ ప్రాంతంలో మంటలు పెట్టడం, చెట్లను నరకడం వంటి చర్యలకు పాల్పడితే కేసులు పెట్టడంతో పాటు, జరిమానా కూడా విధిస్తామని అన్నారు. అడవుల రక్షణ మనందరి బాధ్యతగా భావించాలని ఎఫ్ఆర్‌వో పేర్కొన్నారు. సమావేశంలో డీఆర్‌వో ఖాజామైనొద్దీన్, ఎఫ్ఎస్‌వో శివకుమార్, ఎఫ్‌బీవోలు ముత్యాలు, నర్సింహ, సిబ్బంది ఉన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



లక్ష్మయ్య (ఫైల్)

తెలకపల్లి, ఏప్రిల్ 8 : కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలం గౌరారం గ్రామంలో చోటు చేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బిరుదు లక్ష్మయ్య(45) కుటుంబ కలహాల నేపథ్యంలో ఆదివారం రాత్రి 10:30 గంటల సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన తల్లి గ్రామస్థుల సహాయంతో కుమారుడిని నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి కుమారుడు రవికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.



అల్లాజీగౌడ్ (ఫైల్)

ఉరి వేసుకొని మరొకరు..

చారకొండ, ఏప్రిల్ 8 : ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలం గోకారం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బాదగోని అల్లాజీగౌడ్(47) తాగుడుకు బానిసై కుటుంబ సభ్యులతో గొడవ పడ్డాడు. క్షణికావేశంలో ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య మల్లమ్మ, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భార్య మల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

గుంటి మడుగులో పడి వ్యక్తి మృతి

పెద్దకొత్తపల్లి, ఏప్రిల్ 8 : నీళ్లు తాగేందుకు వెళ్లి మడుగులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం దేవినేనిపల్లి గ్రామ శివారులో చోటు చేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ కుర్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. దేవినేనిపల్లి గ్రామానికి చెందిన దాదిమల్ల కుర్మయ్య(60) గ్రామ శివారులోని గుంటి మడుగులో నీళ్లు తాగేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలుజారి మడుగులో పడి ఊపిరాడక మృతి చెందాడు. మృతుని భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నాగర్‌కర్నూల్ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

లారీ డ్రైవర్‌కు జరిమానా



లారీ టైర్ కింద నలిగిపోయిన మొక్కలు

వడ్డేపల్లి, ఏప్రిల్ 8 : నిర్లక్ష్యంగా వాహనం నడిపి హరితహారం మొక్కలను నాశనం చేసిన ఓ లారీ డ్రైవర్‌కు మునిసిపల్ అధికారులు జరిమానా విధించారు. జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి పురపాలక సంఘం పరిధిలోని శాంతినగర్ మెయిన్‌రోడ్డు పక్కన నాటిన హరితహారం మొక్కలను లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనం నడిపి వాటిపైకి ఎక్కించడంతో అవి నేలపాలయ్యాయి. సమాచారమందుకున్న మునిసిపల్ అధికారులు కమిషనర్ ఆదేశాల మేరకు సోమవారం లారీ డ్రైవర్‌కు రూ.రెండు వేలు జరిమానా విధించారు. వాహనదారులు తమ వాహనాలను నిర్లక్ష్యంగా నడిపి మొక్కలను నాశనం చేస్తే జరిమానా తప్పదని మునిసిపల్ కమిషనర్ హెచ్చరించారు.

కురుమూర్తివాసా.. గోవిందా.. గోవింద

» అమావాస్యతో కిటకిటలాడిన గిరులు



కురుమూర్తిరాయుడిని దర్శించుకుంటున్న భక్తులు

చిన్నచింతకుంట, ఏప్రిల్ 8: మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలోని అమ్మాపురం గ్రామ సమీపంలోని కురుమూర్తి వేంకటేశ్వర స్వామి వారి క్షేత్రం సోమవారం అమావాస్య సందర్భంగా గోవింద నామస్మరణతో మారుమోగింది. తెల్లవారుజామునే వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించున్నారు. జాతర మైదానం అంతా గోవిందా.. గోవిందా.. కురుమూర్తివాసా గోవిందా అంటూ పరవశించిపోయింది. పవిత్ర స్నానాలు ఆచరించిన భక్తులు స్వామి వారికి తమ మొక్కులను తీర్చుకున్నారు.

మతసామరస్యానికి ప్రతీక రంజాన్

- ఉపవాస దీక్షలో దేవున్ని ప్రార్థిస్తే అంతా మంచి జరుగుతుంది
- తెలంగాణ సస్యశ్యామలం కోసం ప్రతీ ఒక్కరు ప్రార్థించండి
- ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లురవి

కందనూలు, ఏప్రిల్ 8 : మత సామరస్యానికి ప్రతీక రంజాన్ మాసమని ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, మాజీ ఎంపీ, కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లురవి అన్నారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్ రెడ్డి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డిలు ముస్లింలకు జిల్లా కేంద్రంలోని సాయిగార్డెన్‌లో సోమవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్ రెడ్డి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లురవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు కఠోర ఉపవాస దీక్షలు చేస్తూ దేవుని ఆజ్ఞ పొందడం సంతోషకరమన్నారు. ఉపవాసంలో ఉన్న ముస్లింలకు కులమతాలకతీతంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసి మత సామరస్య ప్రతీకను చాటడం హర్షణీయమన్నారు. ముస్లింలంతా పవిత్ర మాసంలో దేవుని సన్నిధిలో తెలంగాణ ప్రాంతమంతా సస్యశ్యామలంగా ఉండేలా ప్రార్థించాలని వారు కోరారు. ఈ సందర్భంగా పట్టణంలోని మసీద్ ఇమామ్‌లను మౌజన్‌లకు ప్రత్యేకంగా సత్కరించారు. ముస్లిం మైనార్టీలంతా ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లురవిలను పూల మాలలు, శాలువాలతో సత్కరించారు. ముస్లిం మత పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మునిసిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లురవి

విధుల పట్ల అవగాహన కలిగి ఉండాలి

- కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ రోజున నిర్వహించే విధుల పట్ల పీవో, ఏపీవో, అధికారులకు పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. లోకసభ ఎన్నికలను పారదర్శకంగా, సజావుగా నిర్వహించాలని పోలింగ్‌రోజున నిర్వహించాల్సిన విధులు, బాధ్యతలపై ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. సోమవారం ఐడీవోసీ సమావేశ మందిరంలో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు పోలింగ్ విధులు, బాధ్యతలపై ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమాన్ని జిల్లా ఎన్నికల అధికారి అధ్యక్షతన నిర్వహించారు. నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, కల్వకుర్తి, అచ్చంపేట పీవో, ఏపీవోలకు శిక్షణ కార్యక్రమ ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ రోజున నిర్వహించే విధుల పట్ల ఈవీఎం యంత్రాల పట్ల పూర్తి అవగాహన పొందాలని తెలిపారు. జిల్లాలో నాలుగు నియోజకవర్గాలకు సంబంధించి పీవో, ఏపీవో, సిబ్బంది మొదటి విడత శిక్షణ కార్యక్రమంలో 2417 మంది పాల్గొన్నారని తెలిపారు. పోలింగ్ ఏజెంట్లకు సీక్రెట్ ఓటింగ్, పోలింగ్ నియమాలపై వివరించాలని, పోలింగ్ ప్రారంభానికి 90నిమిషాల ముందు మాక్ పోలింగ్ నిర్వహించే విధానంపై వారికి వివరించాలన్నారు. పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ జరపాలని, మాక్ పోలింగ్‌లో 50కి తక్కువ కాకుండా ఓట్లు వేయాలని, రిజల్ట్ చూసిన తర్వాత ఈవీఎం యంత్రాన్ని క్లియర్ చేయాలని అనంతరం అసలైన పోలింగ్‌కు సన్నద్ధం కావాలని సూచించారు. బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లను పోలింగ్ కేంద్రాల్లో అమర్చడంపై అవగాహన ఉండాలన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే వారు ఫారం-12ఏ, ఫారం-12 ద్వారా ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికెట్, పోస్టల్ బ్యాలెట్‌లు పొంది కచ్చితంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. గత ఎన్నికల అనుభవాల దృష్ట్యా ఏవేని పొరపాట్లు ఉంటే సరిదిద్దుకొని ఎన్నికల నిర్వహణ వంద శాతం విజయవంతం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి తలెత్తే సమస్యలు తమ దృష్టికి తీసుకుని రావాల్సిందిగా కలెక్టర్ తెలిపారు. అనంతరం పోలింగ్ సిబ్బంది గత అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన కొన్ని లోటుపాట్లను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, సంబంధిత అధికారులకు తక్షణమే ఆదేశాలు జారీ చేస్తామని తెలిపారు. అనంతరం కలెక్టరేట్ ప్రాంగణంలోని ఏర్పాటు చేసిన భోజన సదుపాయాలను పరిశీలించి ఆహార నాణ్యతా ప్రమాణాలను ఎన్నికల సిబ్బంది నుంచి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కే.సీతారామారావు, శిక్షణ నోడల్ అధికారి గోపాల్, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.


శిక్షణ తరగతుల్లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

జిల్లా ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు

నాగర్‌కర్నూల్ జిల్లా ప్రజలందరికీ కలెక్టర్ పి.ఉదయ్ కుమార్ నూతన తెలుగు సంవత్సరాది ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు ప్రజలకు నూతన సంవత్సరాది అయిన ఉగాదిని ప్రతీ ఒక్కరు ఆనందంగా జరుపుకోవాలని ఆయన అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ తెలుగు వారికి ఉగాది పండుగ ఎంతో ప్రాముఖ్యం కలదని తెలిపారు. చైత్ర శుద్ధ పాడ్యమి నాడు వచ్చే ఉగాది పండుగకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, కొత్త ఏడాదిలో సరికొత్త ఆలోచనలు, ఆశయాలు, లక్ష్యాలతో ముందుకు సాగాలని, అందరు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో విలసిల్లాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత నూతన లక్ష్యాలను పెట్టుకుని ఆ లక్ష్యాలను అందుకునేందుకు ప్రణాళికాబద్ధంగా కష్టపడాలని అన్నారు. ఉగాది పండుగను కుటుంబ సభ్యులతో ఆనందంగా జరుపుకోవాలని సూచించారు.

ముస్లిం, మైనార్టీలకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

- ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి, ఏప్రిల్ 8 : ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. పవిత్రరంజాన్ పండుగను పురస్కరించుకుని కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్ ముస్లింలకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ముస్లింలతో కలిసి ఎమ్మెల్యే ప్రార్థనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మతాలు వేరైనా మనుషులంతా ఒక్కటేనని ఆయన పేర్కొన్నారు. రంజాన్ మాసాన్ని ముస్లింలు ఎంతో పవిత్రంగా భావిస్తారని, నెలరోజుల పాటు ఉపవాసదీక్షలు ఉండడం ఆదర్శప్రాయమన్నారు. సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు కావాల్సిన అన్ని రకాల వసతులు, వనరులు సమకూరుస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆయన సూచించారు. మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్, జడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ముస్లిం మైనార్టీ నాయకులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

● కోర్టు భవనానికి సహకరించాలి

కల్వకుర్తి పట్టణంలోని శిథిలావస్థకు చేరిన కోర్టు భవనానికి మరమ్మతులు చేయించాలని బార్ అసోసియేషన్ సభ్యులు కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డిని కోరారు. సోమవారం ఎమ్మెల్యేను కలిసి కోర్టు భవనం శిథిలావస్థకు చేరిన విషయాన్ని వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరమణ, కార్యదర్శి లక్ష్మణ్‌రాజు, పలువురు న్యాయవాదులు తదితరులు ఉన్నారు.


కల్వకుర్తిలో మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

వెల్దండ, ఏప్రిల్ 8 : ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందని మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్‌యాదవ్ విమర్శించారు. సోమవారం వెల్దండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలను బీఆర్ఎస్ ప్రభుత్వం కంటికి రెప్పలా కాపాడిందని గుర్తుచేశారు. కాంగ్రెస్‌పార్టీ చెప్పిన కల్లబొల్లి మాయమాటలతో ప్రజలు మోసపోయారని, ఆరు గ్యారెంటీల అమలులో ప్రభుత్వం చేతులెత్తేసిందని మండిపడ్డారు. రైతులకు రుణమాఫీ, సిలిండర్, మహిళలకు 2500, రైతు బీమా, రైతు భరోసా అమలు ఏమయ్యిందని ప్రశ్నించారు. వంద రోజుల్లో ఇచ్చిన హామీలు అమలుచేస్తామని చెప్పిన హామీలు గడువు దాటిపోతున్నా నెరవేరలేదన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు మరోమారు ప్రజలను మోసంచేసేందుకు హామీలు గుప్పిస్తున్నారన్నారు. ప్రజా సంక్షేమాన్ని కాంక్షించే బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ప్రజల గుండెల్లో ఉందని పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు పట్టం కట్టడం ఖాయమన్నారు. కార్యకర్తలు మనోధైర్యం కోల్పోకుండా పార్టీ పటిష్టతకు కృషి చేయాలని జైపాల్‌యాదవ్ కోరారు. సమావేశంలో నాయకులు పత్యానాయక్, వెంకటయ్యగౌడ్, చంద్రమోహన్‌రెడ్డి, భాస్కర్‌రావు, శేఖర్‌ముదిరాజ్, మధుసూదన్‌రెడ్డి, రవి, శ్రీను, ఆనందు, కడారికృష్ణయ్య ఉన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న జైపాల్‌యాదవ్

బాధిత కుటుంబానికి సంతాపం

సల్లపల్లి గ్రామానికి చెందిన పుట్ట లక్ష్మారెడ్డి మృతి చెందడం బాధాకరమని జైపాల్‌యాదవ్ పేర్కొన్నారు. ఈ మేరకు లక్ష్మారెడ్డి మృతదేహంపై జైపాల్‌యాదవ్ పూలమాలలు ఉంచి నివాళులర్పించారు.

మన్ననూరులో కవి సమ్మేళనం


కవి మద్దుల నర్సింహను సన్మానిస్తున్న వీహెచ్‌పీ నాయకులు

మన్ననూర్, ఏప్రిల్ 8: అమ్రాబాద్ మండలం మన్ననూరు వేణుగోపాలస్వామి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కవి సమ్మేళనాన్ని సోమవారం నిర్వహించారు. ఉగాది పర్వదిన విశిష్టతను గాయకుడు కవి మద్దుల నర్సింహ వివరించారు. ఈ సందర్భంగా ఆయనను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర నాయకులు సంభు వెంకట్‌రమణ, జూలూరి సత్యనారాయణ, వీహెచ్‌పీ నాయకులు సంభు శ్రీనివాసులు, శేఖర్, వెలిజాల శ్రీనివాసులు, కాంగ్రెస్ నాయకులు పంబలి బుచ్చయ్య, శివాజి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ

కల్వకుర్తి, ఏప్రిల్ 8 : కల్వకుర్తి మండలం పంజుగుల గ్రామ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సోమవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్లేట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యదర్శి శ్రీధర్, కోశాధికారి శ్రీనివాస్, మెంబర్‌షిప్ కమిటీ చైర్మన్‌కిషన్, సభ్యులు ధారమోని గణేష్, కృష్ణయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌ను చూసైనా బీజేపీ వైఖరిని మార్చుకోవాలి'

వంగూరు ఏప్రిల్ 8: కాంగ్రెస్‌ను చూసైనా బీజేపీ బీసీలపై తమ వైఖరిని మార్చుకోవాలని బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు క్యామ మల్లయ్య అన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా సమగ్ర కులగణన చేపట్టి బీసీ రిజర్వేషన్లను 50 శాతానికి పెంచుతామని, మహిళా బిల్లులో బీసీ మహిళలకు ఉపకోట కల్పిస్తామని కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలో పేర్కొనడం అభినందనీయమన్నారు. సమస్యలపై దేశవ్యాప్తంగా బీసీలు ఉద్యమిస్తుంటే బీజేపీ ప్రభుత్వం పదేళ్లుగా పట్టించుకోలేదని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలన్నారు.

ఉపాధి కూలీల పెండింగ్ బిల్లులు చెల్లించాలి


కలెక్టరేట్‌లో డీఆర్‌డీఏ పీడీ ఓబులేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్, ఏప్రిల్ 8: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించి వారు ఎదుర్కొంటున్న సమస్యలు తక్షణమే పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ పీడీ ఓబులేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పి.నరసింహ మాట్లాడుతూ జిల్లాలో ఎండలు తీవ్రమైన నేపథ్యంలో పని ప్రదేశంలో కూలీలకు తాగునీటి వసతితో పాటు టెంట్లు, మెడికల్ కిట్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించపకోతే వ్యకా.స ఆధ్వర్యంలో ఈ నెల 15 మండల కార్యాలయాల ముందు ధర్నా చేపడతామని ఆయన హెచ్చరించారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కాశన్న, బాస్కర్, మధు, ఆశోక్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

లింగాల, ఏప్రిల్ 8: మద్యం సేవించి వాహనాలను నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని ఏఎస్ఐ శ్రీనివాసులు అన్నారు. సోమవారం మండల పరిధిలోని రాంపూర్ స్టేజి వద్ద వాహనాలను తనిఖీ ముమ్మరంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ మాట్లాడుతూ ప్రతీ వాహన దారుడు వాహనానికి సంబంధించిన ఆర్‌సీ, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ తప్పనిసరిగా వాహనం వెంట ఉంచుకోవాలని అన్నారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలను నడపరాదని కుటుంబాలను దృష్టిలో పెట్టుకొని వాహనాలను నడపాలని అన్నారు. పార్లమెంటు ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రూ. 50వేల కన్నా ఎక్కువ తీసుకరావద్దని తీసుకొచ్చినప్పటికీ వాటికి సంబంధించిన కాగితాలు ఆధారాలను కచ్చితంగా ఉండాలని అన్నారు. ఈ తనిఖీలో హెడ్‌కానిస్టేబుల్ వెంకటయ్య, కానిస్టేబుల్ కిషన్‌సింగ్, శ్రీనివాసులు ఉన్నారు.

ప్రతీ గింజను కొనుగోలు చేస్తాం


బావాజీపల్లిలో ప్రారంభించిన వరి కొనుగోలు కేంద్రం

తిమ్మాజిపేట, ఏప్రిల్ 8 : రైతు పండించిన ప్రతీ గింజను కొనుగోలు చేస్తామని డీపీఎం అరుణాదేవి అన్నారు. తిమ్మాజిపేట మండలంలోని మారేపల్లి, తిమ్మాజిపేట, బావాజీపల్లి, కోడుపర్తి, పోతిరెడ్డిపల్లి, గొరిట, మరికల్ గ్రామాల్లో మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను సోమవారం మండల వ్యవసాయ అధికారి కమల్‌కుమార్ ఏపీఎం శ్రీహరిలతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు పలు సూచనలు, సలహాలు చేశారు. ఏ గ్రేడ్ రకం క్వింటాల్‌కు ధర 2023రూపాయలు కాగా బీగ్రేడ్ రకం 2185 రూపాయలు ధర ఇవ్వడం జరుగుతుందని, సాధారణ తేమ శాతం 14 ఉండాలన్నారు. ప్రతి రైతు తమ ఆధార్‌కార్డుకు మొబైల్ నెంబరు లింక్ చేసి ఉండాలన్నారు. గ్రామాల్లో మహిళా సంఘాల సభ్యులు అందుబాటులో ఉంటారని, రైతు తాము పండించిన పంటను నేరుగా కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకురావాలని దళారులను నమ్మి మోసపోవద్దని ఆమె రైతులకు సూచించారు. జిల్లా ఏపీఎంలు ప్రభాకర్, తిరుపతయ్య, సీసీలు మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రుద్రమదేవి, గ్రామ సంఘం అధ్యక్షులు, వీవోఏలు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

కొనసాగుతున్న మూల్యాంకనం

- జిల్లా విద్యాధికారి గోవిందరాజులు

నాగర్‌కర్నూల్ టౌన్, ఏప్రిల్ 8: జిల్లాలో జరుగుతున్న పదో తరగతి వార్షిక పరీక్షలకు సంబంధించి సోమవారం నాటికి 99,019 జవాబు పత్రాలను మూల్యాకనం చేశామని జిల్లా విద్యాధికారి గోవిందరాజులు తెలిపారు. జిల్లా కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న పదో తరగతి మూల్యాంకనంలో ఆరవ రోజు సోమవారం 23,161 జవాబు పత్రాలను మూల్యాంకనం పూర్తయ్యిందన్నారు. మూల్యాంకనంలో 609 మంది ఉపాధ్యాయులు పాల్గొంటున్నారని, ఇప్పటికి 65 శాతం పూర్తయ్యిందని పేర్కొన్నారు. ఉగాధి, రంజాన్ పండగల సందర్భంగా మంగళ, గురువారాల్లో మూల్యాంకనానికి విరామం ఉంటుందని, పండగల అనంతరం మిగతా రోజుల్లో మూల్యాంకనం యధావిధిగా కొనసాగుతుందని ఆయన తెలిపారు.

కాంగ్రెస్ పార్లమెంటు ఎన్నికల పరిశీలకుడిగా హబీబ్



నాగర్‌కర్నూల్ టౌన్, ఏప్రిల్ 8: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల కాంగ్రెస్ పార్టీ పరిశీలకుడిగా మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ.హబీబ్ నియామకం అయ్యారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్ ఫర్హాన్ అజ్మీ నుంచి సోమవారం ఆయన ఉత్తర్వులు అందుకున్నారు. ఈ సందర్భంగా హబీబ్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ పార్లమెంటు పరిధిలో ముస్లిం మైనార్టీ ఓటర్లను కాంగ్రెస్ వైపు సమాయత్తం చేయ డంతో పాటు మైనార్టీ నాయకులను సమన్వయం చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా నమ్మకంతో తనకు అప్పగించిన బాధ్యత నెరవేరుస్తూ కాంగ్రెస్ పార్టీ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి మల్లు రవి గెలుపు కోసం కృషి చేస్తానని ఆయన అన్నారు.

కొల్లాపూర్ నుంచి షేక్.రహీంపాష



కొల్లాపూర్: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల్లో కొల్లాపూర్ అసెంబ్లీ మైనార్టీ అబ్జర్వర్‌గా కొల్లాపూర్ పట్టణానికి చెందిన 10వ వార్డు కౌన్సిలర్ షేక్.రహీం పాషను నియమిస్తూ ఆలిండియా కాంగ్రెస్ కమిటీ, మైనార్టీ అధ్యక్షుడు ఇమ్రాన్‌ప్రతాప్ అగార్‌యి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కొల్లాపూర్ నియోజకవర్గ మైనార్టీ ప్రజలందరినీ సమీకరించి వారికి కాంగ్రెస్ చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లురవి గెలుపు కోసం కృషి చేయనున్నారు. తనను అబ్జర్వర్‌గా నియమించిన మైనార్టీ అధ్యక్షుడు ఇమ్రాన్‌ప్రతాప్ అగార్‌హి, ఉపాధ్యక్షుడు ఫర్హాన్ అజ్మీ, ఎక్సైజ్, టూరిజం, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావులకు షేక్.రహీంపాష కృతజ్ఞతలు తెలిపారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి


మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బక్క రాధ

ఊర్కొండ, ఏప్రిల్ 8: తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని ఎంపీపీ బక్క రాధ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదిక సమావేశ మందిరంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండలాధికారులు తమ శాఖ పరిధిలోని ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వాటి నివారణ కోసం ప్రత్యేక అధికారులు పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక చొరవ చూపాలని తెలిపారు. ఎంపీడీవో విజయ్ కుమార్, ఎంపీవో వెంకటేశ్వర్లు , తహసీల్దార్ చెన్నకిష్టన్న, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఎల్లమ్మ నాటకం

వంగూరు, ఏప్రిల్ 8: మండలంలోని ఉమ్మాపూర్‌లో మూడు రోజుల పాటు ఎల్లమ్మ నాటకంలో భాగంగా సోమవారం రాత్రి ఎల్లమ్మ, జమదగ్నిల కల్యాణోత్సవం భక్తులను ఆకట్టుకుంది, వీధి నాటకాన్ని తిలకించేందుకు గ్రామస్థులతో పాటు సమీప గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో రావడంతో సందడిగా మారింది. ఎల్లమ్మ, జమదగ్ని, వేషధారణలో కళాకారులు చక్కగా ఆడిపాడారు. భక్తులు నిద్రను మాని చాలా ఆసక్తితో నాటకాన్ని చూసి ముగ్ధులయ్యారు. మంగళవారం నాటకం ముగుస్తుందని, వీధి నాటకాలకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహం అందించాలని నాటకం గురువు రాంచంద్రయ్య కోరారు.

పోలీస్ ప్రజావాణికి ఆరు ఫిర్యాదులు


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్ క్రైం, ఏప్రిల్ 8 : జిల్లా కేంద్రంలోని పోలీస్ సముదాయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ ప్రజావాణికి ఆరు ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్పీ గైక్వాడ్‌వైభవ్ రఘునాథ్ తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో స్వయంగా ఎస్పీ మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంబంధిత పోలీస్ అధికారులకు ఫిర్యాదుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. తగు న్యాయం గురించి రెండు ఫిర్యాదులు, భూమిపంచాయతీలకు సంబంధించి మూడు, భార్యాభర్తల గొడవకు సంబంధించి ఒక ఫిర్యాదు మొత్తం ఆరు ఫిర్యాదులు వచ్చినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు.

ఉపాధి పనులకు ఉదయం వేళలోనే వెళ్లాలి

తాడూరు, ఏప్రిల్ 8 : మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకంలో భాగంగా పని చేసేందుకు వచ్చే కూలీలందరు ఉదయమే తమ పనులకు హాజరు కావాల్సిందిగా ఏపీవో చంద్రసిద్దార్థ సూచించారు. సోమవారం మండలంలోని యంగంపల్లి గ్రామ సమీపంలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కూలీలకు రూ.300 రోజు వారి వేతనం ఉన్నందున అందుకు తగ్గట్టుగానే ప్రభుత్వ నిబంధనల ప్రకారం పనులు చేయాల్సి ఉంటుందని అన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి

పెద్దకొత్తపల్లి, ఏప్రిల్ 8 : గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని టెక్నికల్ అసిస్టెంట్ వెంకటేశ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని నారాయణపల్లి గ్రామంలో మొండికుంటలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఆయన వెంట ఫీల్డ్ అసిస్టెంట్ రాజు, ఆశా కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

ముస్లిం మత పెద్దలకు ఘనంగా సన్మానం

మన్ననూర్, ఏప్రిల్ 8: ముస్లిం మత పెద్దలను కాంగ్రెస్ శ్రేణుల ఆధ్వర్యంలో స్థానిక జామే మసీదు వద్ద సోమవారం ఘనంగా సన్మానించారు. రంజాన్ మాసంలో నిష్ఠతో మసీదుల్లో విధులు నిర్వహిస్తూ ముస్లింలను జాగృతం చేస్తున్న మత గురువులకు రంజాన్ కానుకలను అందజేసి ఘనంగా సన్మానించారు. ఎంపీటీసీ దాసరి శ్రీనివాసులు, కాంగ్రెస్ నాయకులు తుల్యా లోకనాథం, సంభు వెంకట్‌రమణ, జూలూరి సత్యనారాయణ, హన్మంత్‌రెడ్డి, బుచ్చయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రులలో కాన్పుల సంఖ్య పెంచాలి

ఉప్పునుంతల, మార్చి 8 : ప్రభుత్వ ఆసుపత్రులలో కాన్పుల సంఖ్య పెంచాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ తారా సింగ్ అన్నారు. సోమవారం మండల కేంద్రమైన ఉప్పునుంతలలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న రోగుల వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటించాలన్నారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున వైద్య సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలని సూచించారు. ఆసుపత్రులలో రోగుల వివరాలకు సంబంధించి రికార్డులను ఆయన పరిశీలించారు. వైద్యాధికారి రమాకాంత్, వైద్య సిబ్బంది శ్రీనివాసులు, వెంకటమ్మ, రమణ, నసీర్, తదితరులు ఉన్నారు.

రంజాన్‌కు ఏర్పాట్లు పూర్తి


ఈద్గా వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, మునిసిపల్ వైస్ చైర్మన్ షాహేద్

కల్వకుర్తి, ఏప్రిల్ 8 : రంజాన్ పర్వదినానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. కల్వకుర్తి పట్టణంలోని ఈద్గాల వద్ద రంజాన్ పండుగను పురస్కరించుకుని ప్రార్థనలు చేసేందుకు కావాల్సిన ఏర్పాట్లను మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, వైస్ చైర్మన్ షాహేద్‌లు పరిశీలించారు. ఈద్గాల వద్ద అవసరమగు పారిశుధ్య పనులు వెంటనే చేపట్టాలని, ఇతర ఏర్పాట్లు చేయాలని మునిసిపల్ సిబ్బందిని వారు కోరారు. చైర్మన్ వెంట ఈద్గాల కమిటీ సభ్యులు తాహేర్‌అలీ, జాహేద్, ఫారుఖ్, అశ్వక్, ఖాదర్, ముజీబ్, బురాన్ తదితరులు ఉన్నారు.

ఎరువుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి


తిమ్మాజిపేట, ఏప్రిల్ 8 : ఇఫ్కో ఎరువుల గోదాములో నిల్వ ఉన్న రైతుకు అమ్మిన ఎరువుల వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని మండల వ్యవసాయ అధికారి కమల్‌కుమార్ సూచించారు. మండల కేంద్రంలో సింగిల్ విండో కార్యాలయంలోని రైతు సేవా కేంద్రంలోని ఇఫ్కో ఎరువుల గోదామును మండల వ్యవసాయ అధికారి కమల్‌కుమార్ ఆకస్మికంగా సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించి రైతు సేవా కేంద్రం అధికారికి పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ పాస్ మిషన్ ద్వారా అని రైతుకు ఎరువుల అమ్మకాలు జరగాలన్నారు. రైతుకు చెరువులు అమ్మితే రశీదు ఇవ్వడం తప్పనిసరి రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. నిషేధిత మందులు అమ్మితే చర్యలు తప్పవన్నారు.

'పారిశుధ్య కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి'

కల్వకుర్తి, ఏప్రిల్ 8 : పారిశుధ్య కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని మండల రైతు సంక్షేమ సమితి అధ్యక్షుడు బద్దుల రాజు అన్నారు. సోమవారం మండల అభివృద్ధి అధికారి బాలచందర్ సుజన్‌కు పారిశుధ్య కార్మికులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ గ్రామపంచాయతీ పరిధిలో పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులకు నాలుగు నెలలకు పైగా వేతనాలు చెల్లించడం లేదని, వేతనాలు చెల్లించకుండా వారి కుటుంబాలు ఎలా నడుస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగు సంవత్సరం ఉగాది పండుగకు అయినా వేతనాలు చెల్లించాలని ఎంపీడీవోను కోరారు. ఈ విషయంపై ఎంపీడీవో స్పందిస్తూ ఈ విషయం పైఅధికారులకు తెలియజేస్తానని అన్నారని బద్దులరాజు తెలిపారు. నిరుపేద కుటుంబాల వారు కుటుంబాలను పోషించుకోవడానికే పారిశుధ్య పనులు చేస్తారని, అలా పని చేసే కార్మికులకు వేతనాలు ఇవ్వకపోవడం విచారకరమన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పారిశుధ్య కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించి ప్రతీ నెల వేతనాలు సకాలంలో చెల్లించాలన్నారు. పారిశుధ్య కార్మికులు సాయిబాబు, మహేష్, వెంకటయ్య, బాలస్వామి, కార్మికులు పాల్గొన్నారు.

● తెలకపల్లి: గ్రామపంచాయతీ ఉద్యోగులకు పెండింగ్ వేతనాలను వెంట నే చెల్లించాలని జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలకపల్లి మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం దగ్గర సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం గ్రామపంచాయతీ ఉద్యోగులను నమ్మబలికి మోసం చేస్తే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మాట్లాడకుండానే మోసం చేస్తుందన్నారు. గ్రామపంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభు త్వం పరిష్కరించాలని పెండింగ్ వేతనాలను పూర్తిగా చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకుంటే వేసవికాలం సమావేశాల్లో అసెంబ్లీని ముట్టడిస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. లక్ష్మయ్య, బాలస్వామి, శివరాం, రవి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులను నాణ్యతగా చేపట్టాలి


మరికల్ గ్రామంలో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్

పెద్దకొత్తపల్లి, ఏప్రిల్ 8 : గ్రామంలో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతగా చేపట్టాలని ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని మరికల్ గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు 33లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ రోడ్డునిర్మాణ పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. అయన వెంట మాజీ సర్పంచ్‌లు వి.సత్యం, పి.చిన్నయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎండి.హబీబ్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మండల పరిధిలోని వెన్నచెర్ల గ్రామంలో ఖానాపురం జ్ఞానేశ్వర్‌గౌడ్(30) ఆదివారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీపీ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట ఆ గ్రామ ఎంపీటీసీ రవికుమార్, సింగిల్ విండో మాజీ చైర్మన్ బి.బాలస్వామి, మాజీ సర్పంచ్‌పి.చిన్నయ్య, మాజీ ఉప సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాసులు, సురేష్‌గౌడ్, ముచ్చపోతు శంకర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.